
# రాయుడిగారి వేట

పాలగిరి వేణు



"రాజయ్యగోరండీ! రాయుడుగారు మిమ్మల్ని అర్జంటుగా అంటే వున్న పళంగా తీసుకు రమ్మన్నారు... వేంకట్రాయపాళెం నుండి రంగా రెడ్డిగారొచ్చారు..." అంటూ కబురు చెప్పి, పొగాకు కట్టలోంచి ఓ పాయను బయటకు లాగి, విడదీయ సాగాడు అంకిరెడ్డి.

"వస్తున్నా పద... అంకిరెడ్డీ! వైనమేమన్నా తెలుసా?" అంటూ చెక్కుతున్న నాగలిమానును ప్రక్కకు పెట్టాను.

"అబ్బే! తెలియదండీ" అంటూనే విడదీసిన పుగాకును రెండు చుట్టలు చుట్టి, ఒకటి నా ముందు పెడుతూ "అగ్గిపెట్టేస్తారుటండీ" అంటూ చేయి చాపాడు. అగ్గిపెట్టెను యిచ్చాను. మూడో పుల్లతోగాని చుట్టను వెలిగించలేకపోయాడు అంకిరెడ్డి. నా బనియను జేబులో వేసుకున్నాను ఆ చుట్టను.

ఈ పెద్దోళ్లతో వచ్చిన గొడవే యిది. ఎప్పుడు? ఎందుకు?? పిలుస్తారో తెలియదు. వెళ్తే వాళ్ళు చెప్పేది, చేయమనడానికి అంతూ పొంతూ వుండదు. అయినా వెళ్ళక తప్పదు. మర్రి చెట్టుక్రింద బ్రతికే చిన్న చిన్న మొక్కల్లాంటి వాళ్ళం. పెరగడానికి సత్తువ లేనివాళ్ళం మరి.

నేను వెళ్ళేసరికి రాయుడుగారు వాలుకుర్చీలో కూచుని చుట్ట కాలుస్తూ రంగారెడ్డిగారితో ఏదో బాతాఖానీ కొడుతున్నారు. వాలకం చూస్తే అప్పుడే టిఫిన్లు, కాఫీలు ముగిసినట్లున్నాయి.

"అయ్యా! పిల్చారట" అంటూ వసారాలో గోడకు ఆనుకుని ముంగాళ్ళమీద కూచున్నాను.

"ఏరా! రాజిగా!! బావున్నావ్రా!... ఈమధ్య నల్లపూసయిపోయావు. వేంకట్రాయ పాలెం నుండి రంగారెడ్డిగారొచ్చారు ... ఎందు కొచ్చారో తెలుసా?"

"చెప్పందే తెలియదండీ!"

"అయితే విను ... వేంకట్రాయపాలెంలో ఓ మూడురోజుల నుండి పెద్దపులి పడ్తోందట్రా! రోజుకో మేకనో, గొర్రెనో ఎత్తుకెళ్తోందట ... మన సాయం కావాల్సి వచ్చారు. మన తుపాకీలకు పని పడింది. ఏమంటావ్? మరి?"

"నాదే ముందయ్యా! మీరూ 'వూ' అంటే నేనూ 'ఊ...' అంటాను. రాములోరి ఆజ్ఞలను పాటించే హనుమంతుడిలాగా."

"అయితే రెడ్డిగారూ! రేపు మధ్యాహ్నం రెండుగంటలకల్లా చేరుకుంటాం ... ఎరకోసం రెండు మేకల్ని చూసివుంచండి. అయినా రెడ్డిగారూ పారెస్టోళ్ళగ్గాని, పోలీసోళ్ళకుగాని యీ వైనం తెలియదు కదా! ..."

"అమ్మమ్మ! ఎంత మాటండీ! లేని తద్దినాన్ని నెత్తిమీద రుద్దుకుంటామటండీ .! మరి వస్తాం మీరు రేపు మధ్యాహ్నానికల్లా .." అంటూ కుర్చీలోంచి లేచారు రంగారెడ్డిగారు.

"ఎంత మాట తప్పకుండా వస్తాం"

అంటూ రాయుడుగారు భరోసా యిచ్చి, రెడ్డిగార్ని సవారీ బండి వరకు సాగనంపి, బండి కదిలాక వెనక్కి వచ్చారు.

"నీవు 'వూ' అంటే నాదేం లేదన్నార్రా అందుకని నిన్ను పిలిపించమన్నారు రెడ్డిగారు. పిలిపించాను."

"అబ్బే! దానికేముందండీ!" అంటూ నసిగాను

రాయుడుగారికి రాజకీయం తెలుసు.. మనిషిని ముందుకెలా వేయాలో తెలుసు.. ముందుకేసి, పనిని ఎలా సాధించాలోకూడ తెలుసు.

"ఒరేయ్! నర్సిగా! రాజిగాడింట్లో రెండు శేర్ల పెసలు యిచ్చి రా!" అంటూ రాయుడుగారు నర్సిగాణ్ణి పిలిచి చెప్పాడు. ఆ మాట నాకు చెవుల్లో చల్లగా సోకింది.. పెసరట్లు తిని చాల రోజా లయింది మరి.

"సరే! రాజీగా! నీ సరంజామా అంతా సర్దుకుని రేపు మధ్యాహ్నం ఒంటిగంట కంతా వొచ్చేయి. సవారీ బండి 'రెడీ'గా వుంటుంది ఇక నువ్వెళ్ళొచ్చు. ."

రాయుడిగారి దగ్గర శెలవు పుచ్చుకున్నాను.

రాయుడుగారు మా వూళ్ళో పెద్ద భూస్వామి మా వూరి కనుచూపుమేరకు రాయుడిగారి పొలాలు... తోటలూను... మనసు 'మంచి'దేగాని, అప్పుడప్పుడు 'అహం'తో గొడవపెట్టుకొని, దుర్మార్గుణ్ణి చేస్తుంది. ఆ దుర్మార్గానికే లొంగి బ్రతుకుతున్నాం ఆ వూళ్ళో జనమంతా. రాయుడుగారు మంచి 'షికారీ' కూడాను. చుట్టుప్రక్కల గ్రామల్లో ఏ క్రూరమృగం వచ్చిపడ్డా, రాయుడిగార్నే పిలుస్తారు. వన్యమృగాల అడుగుజాడలు చూసి, అది ఏ మృగమో పసిగట్టే ప్రతిభ, నైపుణ్యం వున్నాయి. గురి చూసి కొట్టడంలో చాతుర్యం; మెకాన్ని ఎలా చంపాలో, ప్రణాళికను తయారుచేయడంలో నేర్పు వున్నాయి. అందుకనే యింతవరకు, రాయుడుగారి వేటలో, ఏ క్రూరజంతువు కూడ తప్పించుకోలేక పోయింది. నిజంగా చెప్పాలంటే రాయుడిగారికి యీ 'వేట' పెద్ద వ్యసనం ... మనుష్యుల్ని వేటాడడు ఏదో గొప్ప అవసరం వస్తే తప్ప ... జంతువుల్ని వేటాడ్డంలో రాయుడిగారికి నేను కుడి

భుజాన్ని. నేను లేకుండా, నాకు తెలిసినంతవరకు ఎలాంటి షికారీలు చేయలేదుమరి.

ఆ వుదయమే నా తుపాకీని మూలవేసి శుభ్రం చేశాను. ఇనప రవ్వలు మాత్రం నా దగ్గరుంటాయి. తూటాలు రాయుడిగారి దగ్గరుంటాయి. నా తుపాకీతో చిన్న చిన్న జంతువుల్ని, పిట్టల్ని కాల్చవచ్చు. అంతే ... అయినా తుపాకీ ... తుపాకీయే ... ప్రాణాల్ని తీసేందుకు. మధ్యాహ్నం భోజనం చేసి రాయుడిగారింటికెళ్ళాను. అప్పటికే సవారీ బండి తయారుగావుంది. బండిలో ఓ ప్రక్కగా రాయుడిగారి పెద్ద తుపాకీ విశ్రమిస్తోంది.

అంకిరెడ్డి ఎద్దుల్ని అదిలించాడు. బండి కదిలింది. ముందువైపు నొగల దగ్గర కూచున్నాను. రాయుడుగారు తన భారీ శరీరాన్ని ఒకవైపు జారగిలేసి, కళ్ళు మూసుకున్నాడు.

వేంకట్రాయపాళెం మా వూరికి ఆరు మైళ్ళుంటుంది. దారికూడ బావుండదు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు పాలెం చేరుకున్నాం. రంగారెడ్డిగారింటి ముందు బండి ఆగింది. రెడ్డిగారే స్వయంగా వచ్చి రాయుడిగార్ని ఆహ్వానించి లోనికి తీసుకెళ్ళాడు

ఓ పది నిముషాలయ్యాక వేడి వేడి వుప్మా, కాఫీలు వచ్చాయి. నేను, అంకిరెడ్డి వాటిని ముగించి, వసారాలో కూచుని అలా విశ్రమిద్దామనేలోపుగా, ఆ వూరి జనం పదిమందిదాకా వచ్చి, వసారాలో కూచున్నారు. రాయుడు, రెడ్డిగార్లు కుర్చీల్లో కూచున్నారు.

"అవునండయ్యా! రంగారెడ్డిగోరి బామ్మర్ది పుల్లారెడ్డిగారి పొలం... అదేనయ్యా! చిన్న చింతమాను ప్రక్కన... మా గొర్రెల్ని దరికట్టి పొలంలో వదిలామయ్యా ఎరువుకోసమని... మొన్న రాత్రి.. అర్ధరాత్రి రెండు గంటలయ్యుండచ్చండి . మా కుక్క మొరుగుతోందయ్యా చాల పెద్దగా... లేచి చూచానుగదయ్యా! ఆ దరిప్రక్కన ఓ గొర్రెను నోట కరుచుకొని, ఆ యిప్పచెట్లల్లోకి పారిపోయిందయ్యా ఓ పెద్దపులి ... ! ఎంత పెద్దదనుకున్నారు...? అమ్మో!! భయమేసిందండీ" అంటూ బక్కగా, రివటల్లే వున్న ఓ ఆసామి చెప్పుకుపోతున్నాడు, ఆయాసపడుతూ.

"కానగల తోపు కవతల మేకల్ని మేపుతున్నానండి. సాసవరాయిమీద కూచున్నానండి నేను. మిట్ట మధ్యాహ్నం కదండీ! మేకలన్నీ ఓ చింతచెట్టు కింద గిరిగీసుకు కూచున్నాయండీ ! అంతలోనండీ ! పెద్దపులండీ !! వున్నట్లుండి మేకల మందమీద పడిందండీ! నేను చూస్తూనే వున్నానుకదండీ ! ఓ పెద్ద రాయి తీసి పెద్దపులికి తగిలేటట్లుగా విసిరానండి ! అది సరిగ్గా దాని వీపుమీద పడిందండీ !! మేకను నోట్లో యీడ్చుకుంటూ యిప్పచెట్లలోకి పారిపోయిందండీ!" అంటూ పదహారేళ్ళ పిల్లగాడు చెప్తున్నాడు. వాడి పేరు కొమిరిగాడు.

రా యు డు గా రు మీసాల్ని తిప్పుకుంటూ వింటున్నాడు.

"ఏరా ! రాజిగా బయల్దేరుదామా ?"

"అలాగేనయ్యా !" అంటూ రాయుడిగారి వెంట యిప్పచెట్ల అడివిలోకి ప్రయాణమయ్యాను. మాకు దారి చూపేందుకు కొమిరిగాడు ముందు నడిచాడు.

వేంకట్రాయపాలెం ఆనుకుని ఓ చిన్న అడివి వుంది. చింతచెట్లు, రావిచెట్లు, టేకుచెట్లు, అంతకు మించి యిప్పచెట్లున్నాయి. చెట్టుచెట్టుకు మధ్య ఏవో పిచ్చి ముళ్ళ పొదలు, బ్రహ్మజెముడు డొంకలు, ఈతచెట్లు. అల్లిబిల్లిగా చుట్టుకున్న రకరకాల తీగలు దారి కడ్డంపడి చికాకు కల్గిస్తున్నాయి. గుబురుగావున్న ఆకుల్లోంచి, సాయంకాలపు ఎండ జల్లెడ జల్లించినట్లుగా అడవిమీద పరుచుకుంది. రాయుడుగారు పరిసరాలన్నిటిని గమనించాడు. ఓపొద కవతలగా, చెడ్డ వాసన వస్తోంది. వెళ్ళి చూచాం గదా ! గొర్రెయొక్క కుళ్ళిన ఎముకలు. పురుగులు పట్టి చివికిన చిన్న చిన్న మాంసపు ముక్కలు... అసహ్యంగా చెల్లాచెదరయి వున్నాయి.

"మంచె ఏర్పాటుచేస్తే మంచిదయ్యా! ఈ చోటే బావుంది" అంటూ నేనో సలహా విసిరాను.

"అవ్నా !"

టేకు చెట్టుమీదుగా ఓ ఇరవై అడుగుల ఎత్తులో మంచె ఏర్పాటు చేశారు రంగారెడ్డి మనుష్యులు. నేను, రాయుడుగారు మంచె ఎక్కాం. మేము కనపడకుండా రెండడుగుల ఎత్తులో మంచె చుట్టూ టేకు ఆకుల్ని కప్పాలన్నాం. సరేనన్నారు.

మేము ఎంచుకున్న స్థలానికి ఓ అరవై అడగుల దూరంలో నీళ్ళచెలమ వుంది. చెలమ చుట్టూ పచ్చనిగడ్డిలో ఏదో గుర్తు తెలియని అడుగులు పిచ్చి పిచ్చిగా పడివున్నాయి.

మంచె దిగి రంగారెడ్డిగారింటికి వచ్చేశాం ఓ రెండు గంటలు విశ్రమించాం.

రాత్రి ఎనిమిదయ్యింది మా తుపాకీలు, పెద్ద సర్చ్‌లైట్, పెద్దఫ్లాస్కు నిండా కాఫీ ... నాలుగు ప్యాకెట్ల బిస్కెట్లు ... మెడచుట్టూ మఫ్లర్లు ఇదంతా పెద్ద సరంజామా.

రంగారెడ్డిగారి సేద్యగాడు వుప్పలయ్య మేకను పట్టుకుని ముందు నడుస్తుంటే, రాయుడుగారు, నేను, మా వెనక కొ మ రి గా డు అడివిలోనికి బయల్దేరాం. చుట్టూ చీకటి . . కీచురాళ్ళ అరుపులు ... గుడ్లగూబల స్వైరవిహారం. దూరం నుంచి ఎక్కడో గుంటనక్కల వూళలు ...

ఆ చోటు చేరుకున్నాం. మేకను టేకుచెట్టు క్రింద బలమైన త్రాటితో కట్టేశాడు వుప్పలయ్య "అయ్యా ! మే మె ళ్ళొ స్తాం ..." అంటూ వుప్పలయ్య, కొమరిగాడు వెనక్కి పరుగెత్తికెళ్ళారు భయంతో...అవునుమరి...వాళ్ళంత దూరం వెనక్కి పోవాలి చీకట్లో... మధ్యలో పులి మీదపడితే... ? పాపం ...

రాయుడుగారు, నేను మంచె ఎక్కాం.

రాక్షసిదోమలు చెవులచుట్టూ గీ పెడుతున్నాయి ఏదో పురుగులు ఒంటిమీదకు ప్రాకి దురద పెడుతున్నాయి. మిణుగురు పురుగులు అక్కడక్కడ మెరుస్తున్నాయి చిన్న చిన్న నక్షత్రాల్లా...

మేక అరుస్తోంది... చీకట్లో మరీ దీనంగా.. భయంతో! నిముషాలు... గంటలు గడుస్తున్నాయి ఏ చిన్న అలికిడి అయినా వుషారు పడుతున్నాం.. పులి రాలేదు... టార్చ్‌లైట్ వెలుగులో వాచీ చూశాడు రాయుడుగారు. . మూడున్నర అయిందన్నాడు. "ఈ రాత్రికి పులి రాదు..." అంటూ నిశ్చయంగా చెప్పారు ఇంతలో అరచి... అరచి . అలిసిపోయిన మేక వున్నట్లుండి మళ్ళీ అరవటం మొదలెట్టింది.

ఎండిన ఆకులమీద బరువైన మెత్తటి అడుగుల చప్పుడు... చీకట్లో రెండు కళ్ళు... రెండు ఎర్రటి దీపాల్లా వెలుగుతూ... మెలమెల్లగా గాండ్రిస్తూ మేకపిల్లవైపు రావటం గమనించాం. రాయుడుగారు నన్ను సిద్ధంగా వుండమని సైగ చేశాడు మెల్లగా కదుపుతూ ట్రిగ్గర్‌మీద నా చేయి వేలు బిగుసుకుంటోంది... పులి... మేకమీద ప డ డా ని కి ఒక్కసారిగా దూకినట్లు శబ్దం... 'ధన్'మని చప్పుడు రాయుడిగారి తుపాకీల్లోంచి గుండు దూసుకెళ్ళినట్లు... పెద్దపులి గాండ్రిస్తూ చీకట్లో పరుగులెట్టినట్లు...

"గురి తప్పినట్లుంది రాజిగా..." అంటూ వెంటనే సెర్చ్‌లైట్ వేసి చెట్టు కిందకు చూశారు రాయుడుగారు. రాయుడిగారి తుపాకీ గుండు వృధా కాదనే నమ్మకం నాకుంది. ఏం చెప్పలేకపోయాను.

మేకలేదు. మేకకు కట్టిన తాడు మాత్రం తెగి క్రిందపడి వుంది. పులి మేకను లాక్కొని పారిపోయింది. లైటు కందినంత మాత్రం చుట్టూ చూశారు. ఎక్కడా... ఏలాటి కదిలకలు లేవు. వాతావరణం నిశబ్దంగా వుంది.

## ఇష్టపదులు

ఆకాశమే తానంటూ రవి
ఆక్రోశమే నాదంటూ భువి
అవకాశమే నేనంటూ "పైరవి"
అందలాల పహరాలో పాపాలభైరవి.

సహజన్ముడు చస్తున్నా పస్తులతో
స్వార్ధోన్మత్తుడు మురుస్తాడు ఆస్తులతో
నర రుధిరంపాన మరిగిన పులి
కోరదా తన పేగు బంధపు బలి.

నగరం నడిబొడ్డున వెలసిన
చంబల్ లోయలూ, స్వార్ధపుర
బలిదాన సత్రాలు

ప్రజా సర్వెంట్సుకు విలాస విడిది
విహార క్షేత్రాలు

ఏదయ్యా నీ స్వామ్యవాదం
పొద్దుపొడవని ముద్దు నినాదం.

ప్రభుత్వ యంత్రాంగంనిండా 'బామ్మర్దులు'
నానావిధ భ్రష్ట మార్గ పయన సమర్ధులు
తొక్కిపట్టి నొక్కిపట్టి అణచిన గడ్డిపోచ.

అప్పళంగా ఆరగించేవాడికిది 'డెమోక్రసి'
చెప్పుకుతిరిగేవాడికి 'వెర్బోక్రసి'
చెప్పుచ్చుకు ఎగబడేవాడికి 'మా బోక్రసి'
తప్పించుకు తిరిగేవాడికిదే ధన్స్వోక్రసి.

— డాక్టర్ పి. వి రమణ

# రాయుడిగారి వేట

''చెట్టు దిగి చూద్దామంటావా ?''

''వద్దండయ్యా ! ఎలాగూ ఇంకో రెండు గంటల్లో తెల్లారిపోతుంది.''

రాయుడుగారు అలాగే కూచుని వున్నారు ఇక ఈ పూట పులి రాదని తెలుసు. నాకేమో నిద్రొస్తోంది. బిస్కెట్ పాకెట్ విప్పి, రాయుడిగారి చేతిలో పెట్టాను. ఆయన వద్దన్నారు పులికి తన తుపాకీగుండు తగల్లేదా? తగిల్తే మరి పులి ఏమైంది? ఎక్కడైనా పొదలో వుండివుందా ? మరి మేకను కూడా లాకెళ్ళిందంటే పులికి దెబ్బ తగల్లేదేమో ! అదో నిర్లిప్తతతో వున్నట్లున్నారు రాయుడుగారు.

తెల్లారింది. అడవంతా మేల్కొని ఒక్కసారి వళ్ళు విరుచుకుంది. పక్షుల కిలకిలతో కోలాహలం.

మంచె దిగాం...

చెట్టుకింద మేక రక్తపు మరకలు భూమ్మీద వున్నాయి. ఆ మరకల ఆధారంగా ఎండిన ఆకుల మీదుగా కొంత దూరం వెళ్ళి చూచాం. ఆ పైన మరకలు కనిపించలేదు. అడుగులూ అవుపించలేదు. చుట్టూవున్న పొదల్లోకి రాళ్ళు విసిరి చూశాం. లాభం లేదు. పులి తప్పుకొని దూరంగా పారిపోయింది.

''ఇక వెళ్దామటండీ !''

ఒక్కసారిగా రాయుడుగారు నా వైపు కళ్ళెర్ర చేస్తూ నన్ను తన తుపాకీతో కాల్చేలా చూశారు. నా గుండె గుభేలుమంది.

రాయుడుగారి ఆవేశం అగ్నిపర్వతంలా బ్రద్దలయింది.

''ఓరే ! రాజిగా !! పులి ఎక్కడున్నా ఈ అడవిలోనే వుండాలి. మనకు మాటు అవసరంలేదు. ఎదురునిల్చి కాలుద్దాం ...'' అంటూ ఆవేశం కల్గించిన ఆయాసంతో రొప్పుతూ ముందుకు నడుస్తున్నాడు. రాయుడుగారికి ఎదురుచెప్పలేను. అసమర్థుణ్ణి.

రాయుడుగారి తుపాకీకి గురి తప్పడం మొదటిసారి. తన ఓటమిని అంగీకరించలేక పోతున్నాడు. ఎంతో నమ్మకంతో రంగారెడ్డిగారు ఈ పనిని తనకు కట్టబెట్టారు. అల్లాంటపుడు తన అసమర్థతను వేంకట్రాయపాలెం జనం ముందు చూపలేరు. అందుకని పట్టుదలపట్టాడు, ఎలాగైనా పులిని కాల్చి చంపవలసిందేనని.

నీళ్ళచెలమ వరకు ప్రతిపొద, గుబురు తడుముకుంటూ వెళ్ళాం. చెలమదగ్గర చుట్టూ చూశాం. పులి అడుగుల గుర్తుకాని మేక మాంసపు ముక్కలుగాని కనపడలేదు అప్పటికి తొమ్మిది దాటింది ఈసారి తూర్పుదిశగా బయల్దేరాం చూడాల్సినవన్నీ చూశాం. ఉత్తరదిక్కుగా, దక్షిణదిక్కుగా, వెతికాం. ఊహూ ! పులి జాడలే కనిపించలేదు. పదకొండు దాటింది. ఎండపొడ చాలవేడిగావుంది. రాయుడుగారు వున్నట్లుండి వుగ్రస్వరూపుడయిపోయాడు. ఓ పొదలో ఆకులు కదిలినట్లయ్యాయి. రాయి విసిరాను. ముళ్ళపంది బయటకు వచ్చింది ధన్‌మని రాయుడుగారు పేల్చేశారు. ముళ్ళపంది ముక్కలై మట్టిలో వెదజల్లిపడింది. ఆవేశంతో రొప్పుతున్నాడు... కళ్ళు ఎర్రబడి రక్తం కారేలా వున్నాయి. మనిషి వూగిపోతున్నాడు... చింతచెట్టు మీద కొంగ నిలబడివుంది... 'ధన్' మంటూ కాల్చేశారు రాయుడుగారు.. నాకెంతో ఆశ్చర్యంగా వుంది. రాయుడుగారి చూపు పిచ్చుకలపై పడిందేనని... బ్రహ్మాస్త్రం వదులుతున్నారు. రాయుడుగారిదంతా పులి, సింహం, ఎలుగు, చిరుత షికారీయే... మరి ఆవేశం అలా చేస్తోంది. రెల్లుగడ్డి దుబ్బుల్లోంచి ఓ తెల్లటి అందంగా మెరుస్తున్న కుందేలు జంట గునగునమంటూ పచ్చికలోకి వచ్చాయి. రాయుడిగారి చూపు వాటిమీద పడింది. ట్రిగ్గర్ నొక్కాడు... పది అడుగుల దూరంలో ఎగిరిపడ్డాయి ఆ జంట... మాంసము మట్టిలోపడి దొర్లింది. ఆవేశం తగ్గేవరకు రాయుడుగారు అలానే పేలుస్తుంటాడు... తప్పదు. పులి జాడ తెలియలేదు గాని అప్పటికే ఓ పదిదాకా జంతుజాలాన్ని పేల్చి పారేశాడు. నాకు విసుగేస్తోంది... ఎండ ఎక్కువయింది... ఇంతట్లో... విప్పచెట్టు క్రింద నీడన ఒక నెమలి పురివిప్పి ఆడుతోంది. ఎంతో అందమైన దృశ్యమిది... రాయుడిగారి దృష్టి తప్పిందామనుకున్నాగాని, అంతకుముందే రాయుడుగారు నెమలిపై గురి నిలిపి, ట్రిగ్గర్‌పై చేతి వేలును వుంచి నొక్కబోతున్నాడు.

ఒక్కసారిగా రాయుడిగార్ని ప్రక్కకు తోసేసాను గురి తప్పి, ఆకాశంలోకి పేల్చబడింది

''ఒరేయ్ ! రాజిగా . నన్ను నీవు . '' అంటూ నా చొక్కా లాగిపట్టుకుని, నా కుడిచెంప, ఎడమచెంప తన బలమైనచేత్తో వాయించేస్తున్నాడు కోపంతో వణుకుతున్నాడు ప్రతి దెబ్బా నన్ను బాధపెడుతూనే వుంది. నేను ఎదురు చెప్పడం లేదు. నా కళ్ళల్లో నీళ్ళు సుడులు గట్టి చెంపల మీదుగా జారుతున్నాయి. రాయుడిగారిలో ఆవేశం తగ్గింది అటు వైపుకు ముఖం తిప్పుకొని నిలబడ్డాడు

''లేదండయ్యా ! నెమలి.. దేవతా పక్షి అయ్యగారూ ! దాన్ని చంపితే మీ కుటుంబానికి గొప్ప కీడు జరుగుతుందని ఏదో శాపముందటయ్యా ! అందుకని...'' అంటూ ఏడుస్తూ రాయుడుగారి కాళ్ళమీద పడ్డాను.

''ఒరే ! రాజిగా...'' అంటూ నన్ను లేవనెత్తారు. ఆ పిలుపులో ఎంతో ఆప్యాయత.. ఆత్మీయత వుంది.

''నన్ను క్షమించరా...'' అంటూ నా చేతుల్లో తన చేతుల్ని పెట్టాడు.

''అంత మాటనకండయ్యా !'' అంటూ దూరంగా జరిగాను.

దూరంగా మనుష్యులు వస్తున్నట్లు ఏదో అలజడి.

''పద... వెళ్దాం'' అంటూ రాయుడుగారు ముందుకు నడుస్తుంటే, నేను అనుసరించాను.

దార్లో ఎదురయింది...రంగారెడ్డిగారూనూ.. మా అంకిరెడ్డీను... —

''అయ్యగారూ ! పెద్దమ్మగోరికి ఏదో పురుగు కరిచిందటయ్యా ! ప్రమాదంగా వుందట. మిమ్మల్ని తోడెట్టుకు రమ్మన్నారు'' అంటూ వగురుస్తూ చెప్పాడు అంకిరెడ్డి.

రాయుడ గారు నా ముఖంలోకి అదోరకంగా చూశారు.

పరుగులెత్తాం. సవారీ బండి పరుగులెత్తింది. రెండు గంటల్లో మా వూరు చేరుకున్నాం.

రాయుడిగారింటి ముందు చాల జనం వున్నారు. రాయుడిగార్ని చూసి అందరూ పక్కకు తప్పుకొని లోనికి దారిచ్చారు.

రాయుడిగారి తల్లి ఓ మంచంమీద పడివుంది. నోట్లో తెల్లటి నురగ, క్షణక్షణానికి పాలిపోతున్న ముఖం.


శేషారావు మా వూరి పోస్టు మాస్టర్, టీచర్, ఆపైన డాక్టరు కూడాను. ఏదో ఇంజక్షన్ యిచ్చాడు.

కొద్దిసేపటికి నురగ తగ్గింది. పాలిపోతున్న ముఖంలో జీవకళ మెలమెల్లగా రాసాగింది.

ఇంకో అరగంటకుగాని కళ్ళు తెరవలేదు. వేడివేడి పాలు యిచ్చారు. కొంచెం నెమ్మదించింది. జనం అంతా వెళ్ళిపోయారు.

రాయుడుగారిలో ఒక్కసారిగా చలనం కల్గింది. సవారీ బండ్లోంచి తన తుపాకీని తెమ్మన్నాడు. అంకిరెడి తెచ్చియిచ్చాడు.

ఒక్కసారిగా తన బలమంతా చూపించి,



## విద్యార్థిలోకం వ్యాసరచన పోటీలో మూడవ బహుమతి రు. 500/-లు పొందిన వ్యాసం

# మా విద్యార్థిలోకం ఆశయాలు

విస్తారమైన విద్యార్థిలోకానికి అనేక ఆశయాలూ ఉన్నాయి, ఆ ఆశయాలు సమస్యలుగానూ ఉన్నాయి సమస్యలు తీర్చడం పెద్దల కర్తవ్యం. పూర్వం కన్న ఇప్పుడు అన్ని రంగాలలోను విద్య విస్తృతమయింది. ముందుకు పోవాలని ప్రతి విద్యార్థి ఉరకలు వేస్తున్నాడు. ఏదో చెయ్యాలని, దేశానికేదో సాధించాలని విద్యార్థిలోకం ఆశయం. అయితే అవకాశాలు తక్కువమూలాన్ని ఆ ఆశయానికి అడ్డు ఏర్పడుతోంది. అయితే విదేశాలలో అందరికీ ఎలా ముందుకుపోయే అవకాశాలు ఉన్నాయో ఆ విధంగానే మన దేశంలో కూడా ఆటంకాలు తొలగించి అవకాశం కల్పించాలి.

నేటి దేశపరిస్థితులదృష్ట్యా విద్యావసరాలు విస్తరింపచెయ్యాలి. విద్యకు ప్రభుత్వం ఎంత ఖర్చుపెట్టినా వృధాకాదు. ఎందుకంటే దేశ భవిష్యత్తుకు పునాదిరాళ్ళు ఆ విద్యార్థులే. ప్రభుత్వం కూడా లెక్కలేనన్ని విద్యాలయాలు నెలకొల్పడం కాదు. సమర్థవంతమయిన నిర్వహణలో, వసతితో, బోధనోపకరణములతో, సమర్థులయిన ఉపాధ్యాయవర్గంతో నడపాలి. దానికి అవరోధంగా సమస్యలు వచ్చినా అవి చిన్నవే కనుక డబ్బు వెచ్చించి వాటిని సరిదిద్దుకోవచ్చు కనుక బడ్జెట్‌లో మిగిలినవాటికి తగ్గించుకొని దీనికి వెచ్చించుట అత్యంతావశ్యకము. ఉదాహరణకు తాడికొండ, నాగార్జునసాగర్ మొదలగు రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలు ఎంత ప్రగతిపథంలో ఉన్నాయో, మిగిలినవి ఎంతగా దిగజారి ఉన్నాయో ఎవరికీ తెలియని విషయం కాదు. అయితే అక్కడి అవకాశాలు అన్ని పాఠశాలలకు, కాలేజీలకు ఎందుకు కలగజేయకూడదు ? అలా చేస్తే అన్ని పాఠశాలలు అట్టి ప్రగతిని సాధించవచ్చును కదా! దానివల్ల ఎంతో తెలివైన విద్యార్థులను దేశానికి అందించవచ్చును కదా! వారివలన దేశము యొక్క పేరు ప్రతిష్ఠలు ఎంతగానో విస్తరింపబడును కావున అవకాశములు కల్పించుట ప్రభుత్వ కర్తవ్యము.


చదువు పూర్తిచేసుకున్న విద్యార్థి బ్రతుకు తెరువు కోసం ఉద్యోగాన్ని అభిలషిస్తాడు. అందరికీ ఉద్యోగాలు చూపించడం ప్రభుత్వానికి పెద్ద సమస్య అయింది దేశంలో అడుగడుగునా విద్యాలయాలు స్థాపించినప్పుడు వారికి ఉద్యోగాలు చూపించవలసిన కర్తవ్యం కూడా ప్రభుత్వానికి ఉన్నది. ఆ కర్తవ్యాన్ని ఎదుర్కొనడానికి అనేక సమస్యలుండవచ్చును. బ్రతుకుతెరువుకు ఉపయోగించని విద్యావిధానమువలన నిరుద్యోగసమస్య మరీ గడ్డుగా తయారయింది. నిరుద్యోగులందరికీ భృతి ఇవ్వడానికి ప్రభుత్వం ఆర్థికంగా తట్టుకోలేక పోవచ్చును. అందుకే విద్యావిధానములో అడుగడుగునా మార్పులు కాకుండా మేధావంతులు అన్ని కోణాలనుండి ఆలోచించి సమగ్రమైన, స్థిరమైన ఒక విధానం రూపొందించాలి కనీసం డిగ్రీ తీసుకున్న విద్యార్థి ఏదో ఒక వృత్తిని చేపట్టే అవకాశం ఉండాలి ఆ వృత్తిలో పరిపూర్ణత అతను చదువు పూర్తిచేసేలోగా సిద్ధించాలి. ఆ విధంగా ప్రతి విద్యార్థికి వృత్తి విద్యాప్రావీణ్యం వచ్చి ఉంటే అంతగా నిరుద్యోగ సమస్య ఉండదు అతను బ్రతకడానికి ఒక సోపానం ఏర్పడుతుంది ఇది విద్యావిధానంలో తీసుకురావలసిన పెద్ద మార్పు.

సాంకేతిక విజ్ఞానంలో దేశాలన్నీ పరుగులు తీస్తున్నాయి దేశంలో మేధావంతులున్నప్పుడే ఆ పరుగును అందుకోవడం—వాటితో సమానంగా పరితూగడం జరుగుతుంది. అన్ని శాఖలలోను ఉన్నత విద్యాభ్యాసనములలో మేధావంతులకే ప్రాధాన్యత ఈయవలెను ఏవో పద్ధతుల ద్వారా ఎక్కువ మార్కులు వచ్చినవారికి లభ్యముకాని సీటు, అతి తక్కువ మార్కులు వచ్చినవారికి లభ్యమగుట హాస్యాస్పదమగును దానివలన దేశ ప్రగతికి కావలసిన మేధావంతులు లభ్యముకారు. దానివలన సాంకేతిక విజ్ఞానంలో దేశము వెనుక పడును. అవకాశము ఉండి ‑ందనివారిలో నిరాశానిస్పృహలు ఏర్పడును. అట్టివాటికి ప్రభుత్వము అవకాశమీయరాదు

విద్యాలయములు పవిత్రమైన దేవాలయముల వంటివి ఆ స్థాయి, ఆ సాంప్రదాయము నెలకొన్నపుడే వాటికి సార్థకత సిద్ధించును. ఎన్ని సమస్యలున్నను విద్య అత్యంతావశ్యకము కనుక ప్రభుత్వము దీనిపై వెచ్చించుట తప్పనిసరియని భావించవలెను. విద్యార్థులనుబట్టి భవనముల నిర్మాణము, విద్యార్థులనుబట్టి ఉపాధ్యాయుల పెంపుదల — ప్రయోగశాలలు — మొదలగు హంగులన్నీ ఉన్నపుడే ఆశయసిద్ధి జరుగును.

ఉపాధ్యాయ — విద్యార్థి అవినాభావ సంబంధము కూడ దినదినాభివృద్ధి చెందవలెను గురుకులాశ్రమములలోవలె మంచి విద్య నేర్పవలెనన్నది విద్యార్థిలోకము యొక్క ఆశయము. అది ఉపాధ్యాయులపైననే ఆధారపడియున్నది సామాన్య మానవుని కంటే ఎన్నో రెట్లు మెరుగైన జీవితమును గడుపు ఉపాధ్యాయులు తాముకూడ తృప్తిచెంది ప్రత్యేక బోధనకు అవకాశమివ్వకుండా, అందరినీ సమదృష్టిలో నుంచుకొని తరగతులలో మనస్ఫూర్తిగా బోధన జరిపినపుడే సత్ఫలితములు వచ్చును అట్టిది కట్టుదిట్టముగా జరుపు విషయమున ప్రభుత్వ పర్యవేక్షణ అవసరము. ★

### రచయిత పరిచయం



"1964 లో జననం

తండ్రి : మల్లాది సూర్యనారాయణ

తల్లి : మల్లాది ప్రసాదలక్ష్మి

విద్యాభ్యాసం : బి. కాం. 2వ సంవత్సరం అత్తిలి ఎస్. వి. ఎస్. ఎస్. ఆర్ట్స్ & సైన్సు కాలేజీలో.

చిన్న చిన్న కథలు వ్రాయడం, వ్యాసాలు వ్రాయడం సరదా. బొమ్మలు గీయడంలో కూడా కాస్త పరిచయం ఉంది.

పత్రికలు చదవడం — విమర్శలు వ్రాయడం అలవాటు.

నా వ్యాసానికి బహుమతి ఇచ్చిన ఆంధ్ర సచిత్ర వారపత్రికకు నా కృతజ్ఞతలు."

—ఎం ఎస్. భాస్కర్

---

తుపాకీని ఓ బండకేసి బాదాడు. రెండు ముక్కలయింది.

అందరూ ఆశ్చర్యపోయారు. దేవతా పక్షిపై గురి పెట్టిందానికే తన తల్లికి యింత ఆపద కల్గిందే, నిజంగా కాల్చింటే తన తల్లి తనకు దక్కేదా ? దీనికంతకూ కారణం వేట కల్గించిన ఆవేశం. 'వద్దు ... వేటవద్దు ...' అనుకుంటూ తుపాకీని రెండు ముక్కలు చేశారు రాయుడుగారు ఆ నిజం నాకు తెలుసు.

"అయ్యగోరూ..." అంటూ కొమిరిగాడు పరిగెత్తుకు వచ్చాడు.

"మీరు చంపిన పులి మీరు మంచెకట్టిన టేకు చెట్టుక్రింద ముళ్ళ పొదలో పడి వుందండీ..." అంటూ చెప్పకుపోతున్నాడు కొమిరిగాడు.

రాయుడుగారు చిరునవ్వుతో ఓ అరక్షణం కళ్ళు మూసుకున్నాడు.

నా కెంతో సంతోషంగా వుంది. . రాయుడు గారి గురి తప్పలేదని అయినా బాధగా వుంది. రాయుడిగారితో యిక వేటకెళ్ళే పని లేదేమోనని. అవసరం కూడా లేదేమోనని. ★